క్లుప్తంగా

వాటర్ ప్లాంట్ ఏర్పాటు



పాఠశాలలో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు మరడ శ్రీనివాసరావు శుక్రవారం దీన్ని ప్రారంభించారు. విద్యార్థులకు రక్షిత మంచినీరు అందించాలనే ఉద్దేశంతో రూ.25 వేలతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామంలో పేదింటి ఆడపిల్లలకు పెళ్లిళ్లకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేల నగదు, చీర, సారే అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే గ్రామంలో ప్రైవేటు ఆస్పత్రి ఏర్పాటుచేసి, ప్రజలకు ఉచితంగా వైద్యం, మందులు అందిస్తున్నట్లు చెప్పారు.

పాచిపెంటలో బీఓబీ బ్రాంచ్ ప్రారంభం



మాట్లాడుతున్న బీఓబీ రీజనల్ మేనేజర్ పీఎం పథాత్

పాచిపెంట: మండల కేంద్రంలో బైపాస్‌రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ) నూతన బ్రాంచ్‌ను బ్యాంక్ రీజనల్ మేనేజర్(విశాఖపట్నం) పీఎం పథాత్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంక్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో పాచిపెంటలో బీఓబీ బ్రాంచ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాచిపెంట సంతోషి, బ్రాంచ్ మేనేజర్ భానుప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎస్.దామోదరరావు

పార్వతీపురం టౌన్: ఉద్యోగులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధ చట్టంపై న్యాయమూర్తి అవగాహన కల్పించారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు డా.నారాయణరావు, డా.రఘుకుమార్, డా.విజయమోహన్. డా.ఎం.వినోద్, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ బిల్లుల మంజూరుకు సర్వే

గుమ్మలక్ష్మీపురం: ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో భాగంగా 20216-17, 2017-18, 2018-19 సంవత్సరాలకు సంబంధించిన గృహ నిర్మాణ లబ్ధిదారులు బిల్లులకు నోచుకోని వారు ఉంటే వారి వివరాలు సేకరించాలని మండల నోడల్ అధికారి, జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుమలయ్య సిబ్బందిని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 2021-22లో మంజూరైన ఇళ్ల ప్రగతి ఎలా ఉందో అడిగితెలుసుకున్నారు. అలాగే మినీ రిజర్వాయర్లు, ఫారం పాండ్లు, చెరువుల్లో చేపల పెంపకానికి ముందుకొచ్చేవారిని గుర్తించాలన్నారు. వారికి ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు ఉన్నారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి 'పీఎం జన్‌మాన్'

గరుగుబిల్లి: గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మాన్ పథకాన్ని అమలు చేస్తోందని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని రాయిందొరవలస, చినగుడబ పంచాయతీ గదబవలస గ్రామంలో పీఎం జన్‌మాన్ పథకంపై శుక్రవారం గిరిజనులకు అవగాహన కల్పించారు. గిరిజనులకు మౌలిక సదుపాయాలైన ఇళ్లు, తాగునీరు, విద్యుత్, రహదారులు, కాలువలు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన వారు ఈ పథకంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌరీశంకరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన తప్పనిసరి

● నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి



నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న నగేష్ రెడ్డి

పార్వతీపురంటౌన్: నేత్రదానంపై అపోహలు వీడి అవగాహన పెంచుకోవాలని నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి అన్నారు. జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంచుకోవాలన్నారు. నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం అంధత్వ కేసుల్లో 5 శాతం కార్నియా అంధత్వంతో బాధపడుతున్నారన్నారు. మనదేశంలో 68 లక్షల మంది కార్నియా అంధత్వంతో బాధపడుతుండగా, వారిలో 10 లక్షల మంది రెండు కళ్లు దృష్టి కోల్పోయిన వారు ఉన్నట్లు తెలిపారు. వారిలో ఎక్కువ మంది చిన్నారులే. గాయాలు బారిన పడటం, కంటిలో రసాయనాలు లేదా ఇతర దుమ్ము, ధూళి పడడం వల్ల, వ్యవసాయం చేసే వారిలో వరి రేకు, చెరుకు రేకు కంటికి తగిలినప్పుడు సకాలంలో సరైన చికిత్స పొందకపోవడం వల్ల, నిర్లక్ష్యం చేయడం వల్ల శాశ్వతంగా అంధత్వం పొందుతున్నారన్నారు. నేత్రదానానికి వయసు, కులం, మతం, లింగ బేధం లేకుండా అందరూ కూడా నేత్రదానం చేయవచ్చన్నారు. రక్తపోటు, చక్కెర వ్యాధి, ఆస్తమా కలవారు కూడా నేత్రదానం చేయవచ్చునని తెలిపారు. జిల్లాలో నేత్ర వైద్యాధికారులు, నేత్ర సహాయకులు ద్వారా నిర్వహిస్తున్న నేత్ర వైద్య శిబిరాలు, పాఠశాలల్లో నిర్వహిస్తున్న కంటి వైద్య పరీక్షల్లో నేత్రదానంపై అవగాహన సదస్సులు, అవగాహన ర్యాలీలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ శోభ



అమ్మవారికి సామూహిక పూజలు చేస్తున్న భక్తులు, (ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మవారు

పార్వతీపురం టౌన్: శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రావణశోభ నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు, వ్రతాలు నిర్వహించారు.
భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

లాప్రోస్కోపిక్ యంత్రం వితరణ



లాప్రోస్కోపిక్ మిషన్‌ను తంగరాజు హస్పిటల్‌కు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

సాలూరు: ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ సంస్థ రూ.37 లక్షలు విలువచేసే లాప్రోస్కోపిక్ మిషన్‌ను పట్టణంలోని ఫిలడెల్ఫియా (తంగరాజు) హస్పిటల్‌కు శుక్రవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డివిజనల్ మేనేజర్ శారదాప్రసాద్ మాట్లాడుతూ.. ఎల్ఐసీ పాలసీదారులకు భద్రతతో పాటు ప్రజలకు సామాజిక సేవలు అందించడంలో భారతీయ జీవిత బీమా సంస్థ ముందుంటుందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మొదటిసారిగా ఈ అత్యాధునిక పరికరాన్ని ఫిలడెల్ఫియా (తంగరాజు) హస్పిటల్‌కు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ భాస్కరరావు, సిబ్బంది మనోజ్‌కుమార్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు

● మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు

పార్వతీపురంటౌన్: ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనే లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. మండలంలోని పెదబొండపల్లి పాఠశాలలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025లో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను ఎమ్మెల్సీగా ఎన్నుకుంటే ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించి, అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులను సీనియారిటీ ప్రకారం జూనియర్ లెక్చరర్లుగా, డిప్యూటీ ఈఓలుగా, డైట్ లెక్చరర్లుగా, పదోన్నతులు ఇప్పించడానికి కృషి చేస్తానన్నారు. సీపీఎస్ రద్దు కొరకు ఆయా సంఘాల నాయకులతో కలిసి పనిచేస్తానని, జీఓ 117 తప్పకుండా రద్దు చేయిస్తామని, శిశు సంరక్షణ సెలవులను సర్వీస్‌లో ఎప్పుడైనా వాడుకునేటట్లు చర్యలు తీసుకుంటామన్నారు. ఈహెచ్ఎస్ ద్వారా నేరుగా వైద్య సదుపాయం కార్పొరేట్ ఉద్యోగుల మాదిరిగా అందేటట్లు కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయుల తల్లితండ్రులు మరణిస్తే కార్యక్రమం నిర్వహణ కోసం కనీసం 15 రోజులు ప్రత్యేక సెలవులు మంజూరు చేయిస్తానని, సీబీఎస్సీ పాఠశాలలపై పునఃసమీక్షించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరపు సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కాగాన విజయ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గంట శశికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.శివప్రసాదరావు, రాష్ట్ర కార్యదర్శి జక్కు రామినాయుడు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు భోగి రవికుమార్, జిల్లా కార్యదర్శి గుల్ల రామినాయుడు, పెంట గోపాలక్రిష్ణ, మండల అధ్యక్షుడు బొత్స నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణనాయుడు, తాతబాబు, రాంబాబు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వనసంరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర, జగదీశ్వరి, అటవీశాఖ అధికారులు

సీతానగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యేలు బి.విజయచంద్ర, టి.జగదీశ్వరి పిలుపునిచ్చారు. మండలంలోని గుచ్చిమి రక్షిత అటవీ ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, అటవీశాఖ అధికారులు మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. మొక్కల సంరక్షణతోనే మానవాళి మనుగడ ముడిపడి ఉందని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రాణవాయువును అందివ్వాలంటే చెట్లను సంరక్షించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ పుట్టినరోజు నాడు ఒక మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. జిల్లా అటవీశాఖ అధికారి జీఏపీ ప్రసూన మాట్లాడుతూ.. గుచ్చిమి అటవీ ప్రాంతంలో హెక్టారు విస్తీర్ణంలో వెయ్యి మొక్కలు నాటడం జరిగిందన్నారు. అటవీశాఖ నర్సరీలో మొక్కలు పెంచి వాటిని ప్రజలకు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రవణమ్మ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, సర్పంచ్ కె.సింహాచలం, ఎంపీటీసీ సీహెచ్ జగదీశ్వరరావు, పార్వతీపురం రిషీ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు బి.లక్ష్మణరావు, బి.చిరంజీవులు, గంగమ్మ, జోగింపేట గురుకుల విద్యాలయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో బెడ్ల సంఖ్య పెంచాలి

పాచిపెంట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బెడ్ల సంఖ్య పెంచాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం నాయకులతో కలిసి శుక్రవారం ఆస్పత్రి వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రికి రోజుకు 200 మంది వరకు రోగులు వస్తున్నారని, కేవలం 5 బెడ్లు మాత్రమే అందుబాటులో ఉండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆస్పత్రిలో బెడ్ల సంఖ్య 30కు పెంచేలా స్థానిక మంత్రి సంధ్యారాణి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రక్త పరీక్షలు చేసేందుకు మరో ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించాలన్నారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో పీహెచ్‌సీ వైద్యాధికారి గంటా వెంకటరమణను గురువారం జిల్లా వైద్యాధికారి సరెండర్ చేశారని, ఆయన స్థానంలో మరో వైద్యాధికారిని తక్షణమే నియమించాలని, లేనిపక్షంలో వెంకటరమణను కొనసాగించాలని కోరారు. లేకుంటే ఆస్పత్రికి వచ్చిన రోగులు ఇబ్బందులకు గురవుతారని అన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

పార్వతీపురంటౌన్: సామాజిక పింఛన్ లబ్ధిదారులకు శనివారం నుంచి పింఛన్ డబ్బులు పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. పురపాలక సంఘం పరిధిలోని అన్ని రకాల పింఛన్లు 5,500 ఉన్నాయని, లబ్ధిదారులకు రూ.2,37,62,000 లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 1 ఆదివారం సెలవుదినం కావడంతో శనివారమే సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు అందజేస్తారని పేర్కొన్నారు. పింఛన్ల కోసం లబ్ధిదారులు ఎవరూ సచివాలయాలకు రానవసరం లేదన్నారు. శనివారం తీసుకోని వారికి సెప్టెంబర్ 2న పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పాముకాటుతో వ్యక్తికి అస్వస్థత

సీతానగరం: మండలంలోని చెల్లన్నాయుడువలస గ్రామానికి చెందిన గ్రీన్‌అంబాసిడర్ చెందాన అప్పలనాయుడుకు పాముకాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అప్పలనాయుడు గ్రామ శివారు వీధిలో శుక్రవారం విధులు నిర్వహిస్తుండగా పాము కాటువేసింది. అస్వస్థతకు గురైన అతడిని స్థానికులు పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు.

డీడీ కార్యాలయం తరలించవద్దు..



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

సీతంపేట: స్థానికంగా ఉన్న గిరిజన సంక్షేమశాఖ డీడీ కార్యాలయాన్ని శ్రీకాకుళానికి తరలించవద్దని గిరిజన జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. డీడీ కార్యాలయం తరలిపోతే స్థానికులు ఎన్నో ఇబ్బందులు పడతారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని పరిశీలిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతకు తొలి ప్రాధాన్యం



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా సబ్ జైళ్ల అధికారి మోహనరావు

పాలకొండ రూరల్: వివిధ కేసుల్లో చిక్కుకుని కారాగారాల్లో ఉంటున్న రిమాండ్ ఖైదీల ఆరోగ్య భద్రతకు తొలి ప్రాధాన్యం కల్పించాలని జిల్లా జైళ్ల శాఖ అధికారి కె.మోహనరావు అన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌జైల్‌ను సందర్శించి, ఖైదీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో అవసరమైన చర్యలు చేపట్టాలని జైల్ సూపరింటిండెంట్ బి.జోగులను ఆదేశించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత, వంటశాల, రికార్డుల నిర్వహణ, మెనూ అమలుపై పలు సూచనలు చేశారు.

వేతనాలు చెల్లించాలని నిరసన



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

పార్వతీపురంటౌన్: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు ఆర్‌వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక జిల్లా ఆస్పత్రి వద్ద ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో ఆస్పత్రిలోని శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు, సూపర్‌వైజర్లు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులలో పనులు చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లను కాంట్రాక్టర్ల చేతుల్లో పెట్టడం వల్ల ప్రతి నెలా సక్రమంగా జీతాలు చెల్లించకుండా వర్కర్ల జీవితాలతో ఆటలాడుకుంటున్నారన్నారు. గత 3 నెలలుగా దశల వారీగా వేతనం కోసం, ఉద్యోగ భద్రత కోసం ఉద్యమాలు, శాంతియుత పద్ధతిలో నిరసన ధర్నాలు చేస్తున్నప్పటికీ దీనిపై సంబంధిత జిల్లా అధికారులు దృష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. జీఓ ఉన్నప్పటికీ శ్రమకు తగిన జీతం ఇవ్వకపోగా ప్రతి నెలా జీతాలు సకాలంలో అందక నానా ఇబ్బందులు పడుతున్నారని, వడ్డీ వ్యాపారుల చేతుల్లో చిక్కి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు సింహాద్రి దుర్గారావు, అలజంగి కుమారమ్మా, కార్మికులు సుధీర్, రామరాజు, ప్రసాద్, వెంకటరమణ, ప్రతాప్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక టీకా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

● జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.నారాయణరావు



మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ నారాయణరావు

పార్వతీపురంటౌన్: సార్వత్రిక టీకా కార్యక్రమం ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.నారాయణరావు స్పష్టం చేశారు. ఈ మేరకు వైద్యాధికారులకు, సీహెచ్‌సీ, ప్రాంతీయ ఆస్పత్రి వైద్యులకు గిరిమిత్ర సమావేశ మందిరంలో రీఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిక్షణను డబ్ల్యూహెచ్‌ఓ సర్వలెన్స్ వైద్యాధికారి డా.జాన్ జూడ్ జాషువా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వ్యాక్సినేషన్ ప్రమాణాలను వివరించారు. ఇమ్యునైజేషన్ షెడ్యూల్‌లో చిన్న పిల్లలకు, గర్భిణులకు నిర్దేశించిన సమయంలో టీకాలు వేయాలని, తద్వారా క్షయ, పోలియో మైలిటీస్, మీజిల్స్, రూబెల్లా, డిఫ్తీరియా, కోరింతదగ్గు, ధనుర్వాతం మొదలగు పది రకాల వ్యాధులకు గురికాకుండా నిరోధించవచ్చన్నారు. ఐదేళ్లలోపు పిల్లల్లో మీజిల్స్, రుబెల్ల సోకకుండా రెండుసార్లు ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలని సూచించారు. విద్యార్థుల్లో డిఫ్తీరియా రాకుండా 10, 16 ఏళ్ల వయస్సులో టీడీ వ్యాక్సిన్ వేయాలన్నారు. టీకా పూర్తయిన తర్వాత ఆరోజు ఆరోగ్య పర్యవేక్షణ ఉండాలన్నారు. దద్దుర్లతో కూడిన జ్వరం, ఏఎఫ్‌పీ లక్షణాలు గుర్తిస్తే వెంటనే తెలియజేసి, వారి నుంచి నమూనాలు సేకరించాలన్నారు. ప్రతీ పిల్ల వాని టీకా జాబితా ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.
అనంతరం పలు ఆరోగ్య కార్యక్రమాలపై ప్రోగ్రాం అధికారులు సమీక్షించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.జగన్మోహనరావు మాట్లాడుతూ రక్తహీనత, సీజనల్ వ్యాధులు ఎక్కువగా గుర్తించిన గ్రామాల్లో సంబంధిత శాఖల సమన్వయంతో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు మరింత అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డా.రఘుకుమార్, నోడల్ అధికారి డా.వినోద్, పీపీ యూనిట్ సీనియర్ వైద్యాధికారి డా.విజయమోహన్, ఎస్ఓ శంకర్, వీబీడీ కన్సల్టెంట్ రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో ఉద్యోగాలు ఇవ్వాలి



నిరసన తెలియజేస్తున్న గిరిజన సంక్షేమ సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: గత ఐదేళ్లుగా ఏకలవ్య పాఠశాలల్లో పనిచేస్తూ ఉద్యోగాలు కోల్పోయిన గిరిజన యువతులు లావణ్య, బంగారమ్మకు వారం రోజుల్లో ఉద్యోగాలు ఇవ్వాలని, లేదంటే గిరిజన, ప్రజా సంఘాలతో పోరాటం ఉధృతం చేస్తామని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ హెచ్చరించారు. ఈమేరకు పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనేతరులకు ఉద్యోగాలు ఇవ్వటానికి లేని ఇబ్బందులు, అభ్యంతరాలు గిరిజనులకు ఉద్యోగాలు ఇవ్వటానికి ఏమిటని ప్రశ్నించారు. గిరిజన యువతకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర గవర్నర్, జాతీయ ఎస్టీ కమిషన్, జాతీయ మానవ హక్కుల సంఘాలకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే, రాష్ట్ర హైకోర్టును ఆశ్రయిస్తామని రంజిత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగం కోల్పోయిన గిరిజన యువతులు బంగారమ్మ, లావణ్యతో పాటు గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లా సురేష్, గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్, కోలక మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలు శాశ్వతం కాదు



సాయికాలనీ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

● మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రాజకీయాలు శాశ్వతం కాదని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం తన నైజమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో సుమారు రూ.2 లక్షలతో సాయి కాలనీ వాసులు నిర్మించుకున్న ఆర్చీని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల సమయంలో సాయి కాలనీ వాసులకు ఇచ్చిన నగదును వృథా చేయకుండా కాలనీ ముఖద్వారం నిర్మించుకోవడం, దాన్ని తాను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కాలనీవాసులకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఎప్పుడు ఏ సాయం కావాలన్నా తనను సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బి.శ్రీరాములునాయుడు, వెంకటరమణ, సురేష్ కుమార్, గంగునాయుడు, ఆర్వీ పార్థసారథి, కమిటీ సభ్యులు ధనంజయ్, శ్రీనివాస్, జి.సురేష్, కె.తిరుపతిరావు, గౌరునాయుడు, ముకుందరావు, వై.గోపాలనాయుడు, సూర్యనారాయణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.